సోదరిగా
ఆమెను భావించిన
అతనికి
ఎదురైన అనుభవం?

# వరస

**కళ్ళేపల్లి తిరుమలరావు కథ**

ఎప్పటిలాగే ఆ రోజుకూడా పొద్దున్నే డొక్కు సైకిల్ మీద ఇంగ్లీషు ట్యూషన్‌కి వెళ్ళాను.

రోజూ నే వెళ్ళేసరికి సుతారంగా, అలవోకగా కలుస్తూ విడిపోతూ వుండే అమ్మాయిలూ, అబ్బాయిల చూపులతో గంభీరమైన మాస్టారి ఉపన్యాసంతో పాలిథీన్ పేపర్‌లా తళతళలాడుతుండే పీకేగారిల్లు (పికే అనేది మాస్టారి పేరుకు కురచ రూపం) ఆ రోజు అముద్రిత న్యూస్ పేపర్‌లా వెలవెలపోతోంది.

ఆశ్చర్యపోతూ సైకిల్ స్టాండేసి లోపలకి వెళ్ళసాగాను.

రెండడుగులు అలా వేశానో లేదో ఎదురైంది ఆ అమ్మాయి.

అదే... 'మంజుల' అంటారే— ఆమె!

**దూరం** నుంచీ **అయితే**— ఆమె నలుగురి**లో** ఉండగా— **ఎలాగో** **ధైర్యం** చేసుకుని నలుగురితోపాటు **చూస్తే** చూడగలనుగానీ ప్రపంచాన్నంతటినీ **వెలిగిస్తున్నట్టుండే** ఆ దివ్యమంగళ తేజోమూర్తినీ , **అంత** గొప్ప జీవంతో కదలాడుతూ లోకానికి ఏదో మహత్తరమైన ఆనందాన్ని దానం చేస్తున్నట్టుండే ఆమె కళ్ళనీ సూటిగా చూడగలగటం, ఆమెతో మాట్లాడటం నా వంటి భయస్తుడికి, బిడియస్తుడికి, మొహమాటస్తుడికి— అయ్యే పనేనా?

అందుకే తల వంచుకుని, తప్పించుకుని ముందుకు సాగాను.

"ఈ రోజు ట్యూషన్ లేదటండీ"

ఆ మాటలకు లక్ష్యం ఎవరు? ఎవరి నుంచి వచ్చాయవి?



ఒకవేళ ఆమె నుంచే అయితే?

నా కోసమే అయితే?

"పీకేగారు అనుకోకుండా ఊరెళ్లారట"

ఇక బాగోదని ఎలాగో తంటాలుపడి ఆమె వంక చూడకుండానే "అలాగా థాంక్సండీ!" అంటూ వెనక్కి వచ్చేశాను.

నా ప్రవర్తనకు నవ్వుకుని తలెత్తి తన కళ్ళని ఆమె క్షణంపాటు నా కోసం కేటాయి

ంచిందని నాకెలా తెలుస్తుంది.

అది మొదలుగా ఆమె నాకు ఎక్కడ ఎదురైనా— నేను తప్పించుకోవటానికి ప్రయత్నించినప్పటికీ— వీలైనంత ఎక్కువగా నాతో మాట్లాడుతూ నా బిడియాన్ని నా నుంచీ లాక్కోవటానికి ప్రయత్నించేది.

ఆమెతోపాటు ఆమె స్నేహితురాలుకూడా ఈ కార్యక్రమంలో పాల్గొనేది.

స్నిగ్ధ సంపూర్ణ సౌందర్యరాశి, ఒకానొక భూలోక కుభేరునికి లేకలేక పుట్టిన శ్వేత గులాబీ మొగ్గ అయిన మంజుల నాతో మాట్లాడటం, నన్ను ఆదరించటం చూసి తమ సహజ స్వభావమైన ఈర్ష్యను చిత్రవిచిత్ర కోణాల్లోంచి నా మీద ప్రయోగించసాగారు నా క్లాస్‌మేట్స్— ఆమె చూపుల్లోని ఏ ఒక్క కిరణమైనా తమ మీద ప్రసరిస్తే ఆ మాత్రానికే ఆమె తనూలతిక తమ దేహాన్ని కమ్ముకున్నట్టు భ్రమపడే కాలేజీ కుర్రోళ్ళు!

గోడలమీదా, బోర్డుమీదా మా ఇద్దరి పేర్లూ రాయటం, ఆమె వింటూండగానే మా ఇద్దరి గురించీ కామెంట్ చేయటం— వంటి పనులు విరివిగా జరిగిపోతున్నా— ఆమె నన్ను మాట్లాడించటం మానలేదు. పైగా మునుపటికంటే ఎక్కువగా మాట్లాడటం మొదలెట్టింది— స్నేహితురాలితోసహా!

ఇక లాభం లేదని మా ఇద్దరి చుట్టూ గజిబిజిగా అల్లుకుంటున్న ఇంద్రధనస్సును సొంతంగా ఏదో ఒక రంగులోకి మార్చేయటం గురించి తీవ్రంగా ఆలోచించటం మొదలెట్టాను.

అంతలో డిసెంబర్ నెల అయిపోసాగింది.

ఇంకేముంది జనవరి ఫస్ట్— కొత్త సంవత్సరం— వచ్చేస్తోంది!

అన్ని క్లాసుల మాదిరిగానే మా సెకండియర్ బియ్యేవాళ్ళుకూడా నూతన సంవత్సరానికి ఆహ్వాన సన్నాహాలు ప్రారంభించారు.

చివరికి కాలేజీలో సవతితల్లి ప్రేమనీ, కార్ఖానాలో (ట్యూషన్‌లో) కన్న తల్లి ప్రేమనీ చూపించే పీకేగారి ఇంటి దగ్గర్నుంచీ నూతన సంవత్సరానికి స్వాగతం పలకాలని ఏకగ్రీవంగా తీర్మానించటం జరిగింది.

తలకాయకి పాతిక రూపాయల వంతున డబ్బు వసూలు చేయటానికి పానకాలుగాడికి ఆర్డర్స్ కూడా ఇచ్చేయటం జరిగింది.

నేనొక గ్రీటింగ్ కొన్నాను.

* * *

పొద్దున్నే అందమైన పుస్తకంలో గ్రీటింగ్ పెట్టుకుని డొక్కు సైకిల్‌మీద పీకేగారిల్లు చేరాను.

భారతీయ, పాశ్చాత్య సంస్కృతులను విడివిడిగానూ, కలగాపులగంగానూ ప్రదర్శిస్తున్న రకరాల బట్టల్ని (సంవత్సరంలా కొత్తవాటిని) ధరించి విద్యార్థినీ విద్యార్థులు వెలిగిపోతున్నారు.

నా బట్టలు నలిపయనువి.

పీకేగారు కేక్ కట్ చేయటంద్వారానూ తన నూతన సంవత్సరాన్ని ఆహ్వానించే కార్యక్రమంలో పూర్తిగా మునిగిపోయాడు కుటుంబ సభ్యులతో.

అదే సందు ఇదే సందని అమ్మాయిలూ, అబ్బాయిలూ దీర్ఘకాలంగా తమ మధ్యవున్న మౌనాన్నీ, బిడియాన్నీ తెంపేసుకుని తమకు

వచ్చినవాళ్ళతో కలిసిపోవటానికి ప్రయత్నిస్తున్నారు— మిగిలినవాళ్ళను పట్టించుకోకుండా!

మంజుల మాత్రం నా కోసమే ఎదురు చూస్తోంది— స్నేహితురాలితో.

నన్ను తమతో సమానంగా చూడాలని వాళ్ళిద్దరూ తమ స్థాయినుంచీ దిగి నాలా సగం వయస్సై పోయిన బట్టలు వేసుకోవటం — నాకు బాధ కలిగించిందని వాళ్ళెలా గుర్తించగలరు?

నన్ను చూసి ఇద్దరూ నవ్వారు.

మంజుల "న్యూ ఇయర్ విషెస్" చెపుతూ గ్రీటింగొకటి నా చేతిలో పెట్టింది.

"సేమ్ టూ యూ" అంటూ నా గ్రీటింగ్ ఆమెకిచ్చాను.

నవ్వుతూ తీసుకుంది.

నా చేతికొచ్చిన గ్రీటింగ్‌ను తెరిచాను. దూకుడుగా చదవసాగాను. కళ్ళు కొంతవరకూ నడిచి ఆపై ఆగిపోయాయి. చదివినదాని సారాంశం:

"నా మనసు నన్ను మీతో నిర్మొహమాటంగా ప్రవర్తించమని బాధిస్తున్నప్పటికీ నన్ను నేను నాకు నేనుగా బయటపెట్టుకోలేక ఇలా చేస్తున్నందుకు నన్ను మన్నించగలరు.

నేను... నేను... మిమ్మల్ని ప్రేమిస్తున్నాను!

ఇంతకంటే సూటిగా, కొత్తగా చెప్పటం నాకు చేతకాని పని. మీకు సమ్మతమైతే సాయంత్రం పార్కుకు..."

ఆమె వంక తలెత్తి చూశాను.

అప్పుడే నా గ్రీటింగ్ చదవటం పూర్తిచేసి నా వంక చూసింది. నా చూపులకు నవ్వి—

"చమత్కారం, మెలిక, కష్టపడితేగానీ అసలైన భావం అర్థంకాకపోవటం— కొంచెం కష్టంగానే ఉన్నా అద్భుతంగా ఉంది మీ శైలి.

అది సరేగాని సాయంత్రం మీ కోసం ఎదురుచూపులు— పార్కులో!" అంది.

నా గ్రీటింగ్‌లో నేనామెను "మైడియర్



## మూడో ముడి!

పెళ్ళికొడుకుని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు పురోహితుడు "పెళ్ళికూతురు మెళ్ళో మూడుముళ్ళు వెయ్యాలి బాబూ! రెండేవేసి కూర్చున్నావేమిటి?"

"మూడింట రెండువంతల కట్నమే ఇప్పటికి ముట్టింది. ఆ వంతు కూడా అందుకున్నాక మిగిలిన ముడి వేస్తాలే...."

"...!?!"

—పోలిశెట్టి సునీత (వడ్లమూరు)

సిస్టర్" అని సంబోధించినా అది వదివాకకూడా ఆమె అలా మాట్లాడటం నాకు అసహ్యాన్ని కలిగించింది.

"అన్నా చెల్లెలు, అక్కా, తమ్ముడు"— అన్న పిలుపులు నరాల బాధ తీర్చే చీకటిపొత్తులనుంచీ స్త్రీ పురుషుల్ని కాపాడే తాయెత్తులన్న విషయంమీద ఆమెకు బాగా నమ్మకమున్నట్టుంది!


అందుకే... అందుకే... నన్నూ, నా పిలుపునూ 'ఆ ఖాతా'లో జమకట్టేసింది.

అంతే ఆమిచ్చిన గ్రీటింగును ముక్కలు ముక్కలుగా చింపేసి ఆమె ముఖాన కొట్టి వచ్చేశాను.

కానీ—

ఆ గ్రీటింగ్ ఆమెది కాదనీ, ఆమె స్నేహితురాలు తను స్వయంగా ఇవ్వలేక ఆమె ద్వారా ఇప్పించిందనీ, గ్రీటింగ్‌ను పూర్తిగా చదవకపోవటంవల్ల ఆ విషయాన్ని తెలుసుకోలేక పోయాననీ— ఎప్పటికైనా తెలుకోగలనా?

*



డిజైన్: ఆర్. తారాబాలకృష్ణ (హైదరాబాద్)